# పెట్టుబడి దారు

"ఏమేవ్....ఒసేయ్! గోదారీ!...."

గంగెద్దు గంగయ్య ఉరుముల్ని దూరంనుండే గమనించింది గోదావరి. చేతిమీది పని వొదిలేసి వచ్చి ఎదురుగా నిల్చుంది.

తలంటుస్నానం చేసిందికాబోలు.... విరబోసుకున్న కురుల్ని సిగగా సింగారించుకుంది. భుజమ్మీదున్న పూలదండను సిగ కెక్కిస్తూ....

"ఏమిటా పిలుపులు....? ఇంటికి నూరు గజాల దూరం నుండేనా...? కొంటెగా మందలిస్తూంటే ముక్కుపుడక తళుక్కుమంది. గంగయ్య మనసు గంతులేసింది.

ఊరంతా తిరిగొచ్చిన అలసట అట్టేమాయమైంది. గంగెద్దు మీదున్న బరువుల్ని ఖాళీ చేసారిద్దఱు.

ఆ రోజు దొరికిన గుడ్డలు మడతపెట్టి దండెమ్మీదవేసి, బకెట్టుతో నీళ్ళుతెచ్చి గంగెద్దు ముందుంచింది గోదావరి. బియ్యం వగైరాలతో నిండిన సంచిని చంక నుండి దించి, నగదు

డబ్బుల్ని అర్ధాంగి చేతులో పోసాడు గంగయ్య. కరెంటు బల్బు లా వెలిగింది గోదావరి మొహం.

చిల్లెర డబ్బులు లేక్కబెట్టి ట్రంకు పెట్టెలో పోసింది. కాళ్ళూ చేతులు కడుక్కొని డ్రెస్సు మార్చిన గంగయ్య ముందుకొచ్చి

"ఈ పెంకుటింట్లో ఎంతెన్నాళ్ళుండాం? ఓ బంగళా కట్టుకుం దామయ్యా!" అందిగోముగా- మెలికలు తిరిగిపోతూ.

గోదావరి కోర్కె నబబుగానే తోచింది. కాని .... వెంటనే అసలు విషయం గుర్తుకొచ్చి

"పిచ్చిదానా! గంగెద్దోడికి బంగళా వుంటే గంటెడు బిచ్చ మెవ్వడన్నా వేస్తాడా....! కలియుగమే ఇదీ ....కలియుగం .... బంగళాలో వుంటూ బిచ్చమడుక్కునేందుకు సిగ్గు లేదాంటూ తరి మేస్తారే .... ! '' నగ్న సత్యం చెప్పాడు గంగెద్దును గుంజకు కట్టేస్తూ.

ఇదంతా చూచాడో పదేళ్ళ బుడత-రాకేష్. తుర్రున తమ గుడిసెలోకి పరుగెత్తి

"అయ్యా! అయ్యోయ్!" కేకేసాడు.

అప్పుడే గుడిసెలో అడుగుపెట్టిన తండ్రి ఎంకట్రాజు

"ఏమిట్రా'' అన్నాడు అలసటగా .... చంకనున్న సంచిని భార్య నర్సమ్మ కందిస్తూ.

"ఇయ్యాల్లెన్ని పైసలు దొరికినై ....'' అడిగాడు ఆతృతగా

''పిచ్చోడా! మనం ముష్టోల్లం. మనకు డబ్బులు వేయరు గింజలేస్తారు. లేదా కూడు వేస్తారు.''

తండ్రి సమాధానం ఏమాత్రం నచ్చలేదు వాడికి.

నిరుత్సాహాన్ని అణచుకుని వాళ్ళమ్మ వైపు తిరిగాడు.

"అమ్మా ....! మనం బంగ్లా ఎప్పుడు కట్టుకుందామే?" అడిగాడు హుషారుగా

మొదట నోరెళ్లబెట్టి ఆతర్వాత

"ఆఁ .... బంగ్లనా?" గలగల నవ్వేసింది నర్సమ్మ.

"మనకు పెంకుటిల్లే లేదు .... బంగ్లా ఎట్లా కడతాంరా?." చిరుగుల షర్టును గుడిసెకు విగిలిస్తూ అడిగాడు తండ్రి.

"ఆ గంగెద్దు గంగయ్య మామ వాళ్ళు కట్టు కుంటారట!" గొణిగాడు ఏదో పోగొట్టుకున్న వాడిలా.

"ఓహో, అదా!! గంగయ్య మామ పెట్టుబడిదారురా! గంగెద్దు మీద పెట్టుబడి పెట్టి. కొని, దాంతో సంపాదిస్తున్నాడు"

తండ్రిమాటలు వాడి కర్థమైనాయో లేదోగాని గమ్మున నోరుమూసుకున్నాడు.

"పెట్టుబడి దారా?... మరి నువ్వ గూడా బట్ట కొని, సంచి కుట్టించి పెట్టుబడి పెడ్తివి గదా! నువ్వ గూడా పెట్టుబడి దారువే గదా!" అంది నర్సమ్మ దవడలు నొక్కుకుంటూ.

బిత్తర పోవడం ఎంకట్రాజు వంతైంది.

( సాధన—నవంబర్ 1986 )

